# అపోలో కథ

"నన్ను క్షమించండి నాన్నగారూ...నాకీ వివాహం ఇష్టం లేదు.."

కృష్ణారావుగారులిక్కిపడి కొడుకు వంక చూశారు. అనుకోని సమాధానమది ఆయనకు కానీ వరహాలరావు తాపీగా కనిపించడానికి ప్రయత్నిస్తూ ఎటో చూస్తున్నాడు.

కృష్ణారావుగారికి వరహాలరావు ప్రథమ సంతానం. అతని తర్వాత వరుసగా ముగ్గురు ఆడపిల్లలూ, ఆఖరున మరో అబ్బాయీ ఉన్నారు. సీత, రామలక్ష్మి, శశిరేఖ, వ్యాఘ్రేశ్వర్రావు వాళ్ల పేర్లు. పద్దెనిమది, పదహారు, పన్నెండు, తొమ్మిది వాళ్ళ వయస్సులు. బియ్యే సెకండియరూ, బియ్యే ఫస్టియరూ, థర్డు ఫారమూ, అయిదవ క్లాసూ వాళ్ల చదు వులు. ప్రథమ సంతానమైన ఇరవై రెండేళ్ళ వరహాలరావు యమ్మెస్సీ ప్యాసయ్యాడు. ప్యాసై ఆరు నెల్లయింది. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు.

కృష్ణారావుగారు కూడా వరహాలరావు ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు. ఆయన కొడుకు మీద చాలా ఆశలు పెట్టుకున్నారు. ఎప్పుడూ క్లాసులో మొదటి వాడుగా వస్తూండే అతని మీద ఆయన ఆశలు పెట్టుకోవడంలోనూ, అలా పెట్టుకున్న ఆశలు పెంచు కోవడంలోనూ తప్పుందని ఎవరూ అనలేరు. అందుకు కారణం ఆయన ఆర్థిక పరిస్థితి. కృష్ణారావుగారు పేదవాడు కాకపోయినా తన సంతానం దృష్ట్యా ..ధనవంతుడని మాత్రం అనలేము. ఎకరానికి ఇరవై బస్తాలు పండే అయిదెకరాల సుక్షేత్రమూ, ఉండడానికో స్వంత ఇల్లూ ఆయన స్థిరాస్తులయితే నెలకు సుమారు నాలుగొందలొచ్చే ఉద్యోగం చరాస్తి.

ఇంకా కృష్ణారావుగారికి కుటుంబంలోఇద్దరు సభ్యులు మిగిలిపోయారు. ఒకరు కృష్ణారావుగారి భార్యామణి జానకమ్మ, మరొకరు ఆయన తల్లి సరస్వతమ్మ. వాళ్ళ అసలు పేర్లు జానకి, సరస్వతి అయినప్పటికీ.. చివర అమ్మ అనే పదాన్ని వారికి వయస్సు

ప్రసాదించింది. వీరిరువురికీ కూడా వరహాలరావు ఉద్యోగం మీద ధ్యాస లేదు. వారి ధ్యాసల్లా అతని వివాహం గురించే.

మనుమడి పెళ్ళి చూడాలని సరస్వతమ్మగారు మృత్యువును అవతల నిలబెడితే, కొడుక్కి పెళ్ళిచేసి కోడల్ని తెచ్చుకుని అథార్టీ చెలాయించాలని జానకమ్మగారు ముచ్చట పడుతోంది. అదీకాక వరహాలరావు పెళ్ళి గురించి వీళ్ళు మరింత తొందరపడడానికి మరో కారణముంది. అదే సీత పెళ్ళి!

కృష్ణారావుగారికి వచ్చే సంపాదన ఇంచుమించుగా ఏ నెలకానెలే అయిపోవడంవల్ల ఆయన దగ్గర చెప్పుకోదగ్గ నిలవలేమీ లేవు. ఆ విషయం చాలా మంది నమ్మరు. తనకున్న ఆస్తితో, వచ్చే జీతంతో ఈపాటికి కనీసం లక్షయినా నిలవేసుండడా అని చాలా మంది అనుమానం. వాళ్ళ అనుమానానికి బొత్తిగా అర్థం లేకపోలేదు. లక్షకాకపోయినా, కొంచెం జాగ్రత్తగా ఉండి ఉంటే, కనీసం పాతిక ముప్ఫై వేలయినా ఆయనీపాటికి నిలవేసి ఉండవలసింది. అయితే ఆయన జాగ్రత్తగల మనిషి కాదు. ఆయన ఇల్లు చాలా నీటుగా ఉంటుంది. ఇంటి చుట్టూ అందమైన పూలతోట ఇంటిలో చాలా గదులకు సీలింగ్‌ఫ్యాన్సు ఉన్నాయి. అందమైన సోఫాసెట్లూ, ఫ్రిజ్‌డైరూ ఉన్నాయి. ఇవన్నీకాక ఇంటికిద్దరు నౌకర్లు కూడా ఉన్నారు.

ఇదంతా అనవసరమని చాలా మంది అనుకోవచ్చు. కానీ ఎవరి సరదా వాళ్ళది. కొంతమందికి నిలవ పెరిగిన కొద్దీ సంతోషం పెరుగుతుంటే, మరికొంతమందికి కన్ను కుడుతుంది. రెండు మూడు వేలు చేతిలో ఉన్నాయంటే ఆయనకు ఒళ్లు తెలియదు. ఇంట్లో అందరూ ఖరీదైన బట్టలు కడతారు. తరుచుగా సినిమాలు - ఖరీదైన టికెట్లతో చూస్తారు. కృష్ణారావుగారికి కూతురి పెళ్ళి బాధ్యత అర్థం కాలేదనడానికి ఒకే ఒక ఉదాహరణ చెప్పాలి. పెద్ద కూతురు పదిహేనేళ్ళ వయసప్పుడాయన అయిదు వేలు ఖర్చుపెట్టి కొడుక్కి స్కూటరు కొన్నారు.

ఈ పరిస్థితులన్నింటివల్లా ప్రస్తుతం కృష్ణారావుగారి బ్యాంకు నిల్వ వెయ్యి రూపాయలు మించదు. అయినా ఆయనకంత బాధగా లేదు. కొడుక్కుపెళ్లి చేసి వచ్చే కట్నంతో పెద్ద కూతురి పెళ్లి చేయవచ్చుననీ, తర్వాత నెల నెలా కొడుకు పంపించే డబ్బు అలాగే నిలవేసి కొంచెం జాగ్రత్తగా ఉండి మిగతావాళ్ల పెళ్లిళ్ళూ వగైరాలు పూర్తి చేయవచ్చుననీ ఆయన ధైర్యం. ఆయన ధైర్యానికి మరో కారణం ఇంకా తనకు పదేళ్ళ సర్వీసుండడం కూడా కావచ్చును. ఏదేమయినా ఆయన కొద్ది కొద్దిగా కళ్ళు తెరవడం ప్రారంభించారని చెప్పవచ్చు.

ఇటువంటి సమయంలో ఆయనకు చక్కని సంబంధం కలిసి వచ్చింది. అమ్మాయి బియ్యే మొదటి సంవత్సరం చదువుతోంది. కలవారి పిల్ల. కట్నం పది వేలకు తక్కువ కాకుండా ఇస్తామన్నారు.ముఖ్యంగా చెప్పుకోదగ్గ విషయం మాలతి వరహాలరావుకి ఈడూ జోడూగా ఉంటుంది. ఏ విధంగానూ లోటు చూడలేని కృష్ణారావుగారు ఇంచుమించుగా ఈ సంబంధానికి అంగీకరించేశారు. ఇంక పెళ్లి చూపులు తరువాయి. అయితే ఈ సందర్భంలోనే తన అనంగీకారాన్ని వరహాలరావు నిర్మొహమాటంగా ప్రకటించాడు. పెళ్లి చూపులకు

వెళ్లడానికి కూడా అతనిష్టపడలేదు.

"నేనామెను చేసుకోకపోవడం ముందే నిర్ణయమైపోయినప్పుడు పెళ్లి చూపులకు వెళ్ళి వాళ్ళను నొప్పించడం బాగుండదు కాబట్టి.. నన్ను క్షమించండి.. నాన్నగారూ! నాకీ వివాహం ఇష్టం లేదు..." అనేశాడతను.

"ఏంలోటని కాదంటావురా...పిల్లకు అందం ఉంది, గుణం ఉంది, చదువుంది, సిరి ఉంది.." సరస్వతమ్మగారు సాగదీసింది.

వరహాలరావు మాట్లాడలేదు. నిజానికి బామ్మ చెప్పిన లక్షణాలన్నీ ఆ అమ్మాయి కున్నాయి. ఆ అమ్మాయిలో ఏ లోపమూ అతను చూపించలేడు. అసలు లోపం అతనిలోనే ఉంది. అతని మనసులో ఆ అమ్మాయి ఎడల ప్రేమ లోపించింది. అందుక్కారణం అతని ప్రేమ అంతకుముందే శ్యామల కంకితమైపోయింది.

వరహాలరావు చాలా మంచివాడనడానికి అతను శ్యామలను ప్రేమించడమొక ఉదాహరణగా తీసుకోవచ్చు. శ్యామల ధనవంతురాలు కాదు. ఇంకా చెప్పాలంటే పేదరాలు. ఒక ధర్మాత్ముడి సహాయంతో చదువు కొనసాగిస్తోంది. ఆమె తల్లి వంటపని చేస్తోంది. అటువంటి శ్యామల చెప్పుకోదగ్గ అందగత్తె కూడా కాదు. కనుముక్కు తీరు మాత్రం బాగానే ఉండి చామనచాయ రంగులో ఉంటుంది. చదువులో కూడా థర్డు క్లాసు తెలివితేటలు మాత్రమే. అవయినా ఆమె ఎంతో కష్టపడి చదవడం వల్ల మాత్రమే లభించినవి. అదీకాక శ్యామల తన అందాన్ని ద్విగుణీకృతం చేసే ప్రయత్నాలకెన్నడూ పోలేదు. కడుపు మాడ్చుకునైనా ఖరీదైన బట్టలు కట్టుకోవాలనుకునే తత్వం కాదామెది. అందువల్ల నిత్యమూ కాలేజికి వస్తూ పోతూ ఉన్నప్పటికీ ఆమె గురించి చాలా మందికి తెలియదు. వరహాలరావుతో పరిచయం ప్రారంభించాక కూడా ఆమె గురించి చాలా మందికి తెలియదు. వాళ్ళ పరిచయం చాలా మందికి కేవలం సాధారణమైనదిగా మాత్రమే కనిపించేది. అందుక్కారణం వరహాలరావు తీసుకున్న జాగ్రత్త అని చెప్పలేము. చాలాకాలం వరకూ వాళ్ళిద్దరకూ ఒకరినొకరు ప్రేమించుకున్నట్లు తెలియలేదు. సెలవుల్లో విడిపోయినప్పుడు ఇద్దరకూ ఒకరినొకరు ప్రేమించుకుంటున్నట్లు గ్రహింపయింది. అయినప్పటికీ వారి స్నేహం అవధులు దాటలేదు. అందుక్కారణం ఇద్దరూ స్వతహాగా దూరాలోచన కలవాళ్ళవడమేకాక, పిరికివాళ్లపడం కూడాను. కానీ కొద్ది నెలల పరిచయం అనంతరం ఇద్దరూ వివాహం చేసుకోవాలని దృఢనిశ్చయానికి మాత్రం వచ్చేశారు. తనకుద్యోగం రాగానే శ్యామలను వివాహం చేసుకుంటానని వరహాలరావు మాటిచ్చేశాడు కూడా. అతను గాఢంగా శ్యామలను ప్రేమించాడు. ఆమెను పెళ్ళి చేసుకోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. అతని ప్రేమలోని గాఢత్వాన్నీ, నిర్ణయంలోని దృఢత్వాన్నీ లొంగదీయగల శక్తి మాలతి అందానికిగానీ, ఐశ్వర్యానికిగానీ లేకపోయింది.

"అలా మాట్లాడకుండా ముంగిలా కూర్చుంటే ఎలాగ? నేనడిగిందానికి చెప్పరా?" అంది బామ్మ.

"నా కిష్టంలేదని ఎప్పుడో చెప్పాను..ఇంక నేను చెప్పాల్సిందేమీలేదు..." అన్నాడు

వరహాలరావు.

"దేనికైనా ఓ కారణమంటూ ఏడుస్తుంది కటుటోయ్!" అన్నారు కృష్ణారావుగారు.

వరహాలరావు మాట్లాడకుండా బయటకు నడవబోయాడు.

"నేను మాట్లాడతూంటే అలా పారిపోతావేమిరా..ఒక్క నిముషం ఆగు!"

"నాకు పనుంది!" వరహాలరావు వినిపించుకోకుండా బయటకు నడిచాడు.

కృష్ణారావుగారు గర్జించారు."వెళ్లు...ఎక్కడికి వెడతావో..బాగా ఆలోచించుకుని మళ్లీ రా. పెళ్ళికి ఒప్పుకునే మాటైతేనే మళ్ళీ ఇంట్లో అడుగుపెట్టు!" - ఒక విధమైన ఉక్రోషంతో ఆయన ఆ మాటలు అనేసి నాలిక్కరుచుకున్నారు. అయితే ఆ మాటలు వరహాలరావు విన్నాడనడానికి సాక్ష్యంగా అతనినడకలో వేగం హెచ్చింది.

అలా ఏకబిగిన నడిచి వరహాలరావు మెయిన్ రోడ్ చేరుకున్నాడు. ఓసారి జేబులు తడుముకున్నాడు. జేబులో పద్దెనిమిది రూపాయల నలభై రెండు పైసలున్నాయి. వాటితోపాటే మురళి రాసిన ఉత్తరం కూడా ఉంది.'కొన్నాళ్లపాటు ఇక్కడొచ్చి ఉండకూడదూ - ఉద్యోగం ట్రయల్స్ వెయ్యవచ్చును. ఈ రోజుల్లో దూరంగా ఉంటే పన్లేం జరుగుతాయి?' అన్నది ఆ ఉత్తరంలోని సారాంశం. రాజమండ్రి నుంచి విశాఖపట్నానికి ఆరేడు రూపాయలు రైలు టిక్కెట్టుకు పోగా, మిగిలేది ధైర్యానికుంటుంది. ఆపైన అసలు ధైర్యం మురళి ఉన్నాడు. ఆవేశం క్షణాల మీద నిర్ణయానికి రప్పించి అతన్ని స్టేషనుకు నడిపించింది.

అతనికి తలిదండ్రులమీద విపరీతమైన కోపం కలిగింది. ఇంత చదువు చదువుకుని ఓ వ్యక్తిగా నిలబడ్డ తన వ్యక్తిత్వాన్ని గుర్తించకుండా, తన ఇష్టాయిష్టాలతో పనిలేకుండా సంబంధాన్ని కురురుస్తారా? సరే కుదిర్చారు...బాగానే ఉంది.. అది తన మీద రుద్దడానికి ప్రయత్నించడమెందుకు? తన కిష్టం లేదనగానే మానేయొచ్చుగా? అలా ఎందుకు మాన్తారు? వాళ్ళు స్వార్థపరు లు...తనకొచ్చే కట్నం ద్వారా ఎన్నో చేయాలని కలలు కంటున్నారుమరి! ఆ కలలు పండేదెలా?

అతనికి ఒక్క క్షణంపాటు స్వార్థపరత్వం మీద అసహ్యం వేసింది. స్వార్థం ఎంత చెడ్డది? స్వార్థం ముందు బంధుత్వాలు కూడా నిలబడవు. ఆ స్వార్థం వల్లనే ఈ రోజు కన్నతండ్రి తనని ఇంట్లోంచి పొమ్మని అనగలిగాడు. ఆ స్వార్థం వల్లనే తను తన కన్నతండ్రిని కాదని ఇల్లు వదిలి వచ్చేశాడని అతని బుర్రకు తట్టలేదు. అయినా అతని ఆలోచనలు ఆ కోణంలో నడవడం లేదు. అతని దృష్టంతా ఇతరుల స్వార్థం మీదే ఉంది.

ట్రయిన్ రాజమండ్రికి దూరంగా పోతున్నకొద్దీ అతని ఆవేశం క్రమంగా అణగారి అతని ఆలోచనల పరిధి పెరిగింది. తల్లిదండ్రులమీంచి అతని ఆలోచన శ్యామల మీదకు మళ్లింది. తను వీలైనంత తొందర్లో శ్యామలను వివాహం చేసుకోవాలి. ముందు వాల్తేరు వెళ్లగానే ఆమెను కలవాలి. ఆమెతో మాట్లాడి ఆ తర్వాత మురళి రూముకి వెళ్లాలనుకున్నాడు. అంతలోనే అతనికి గుర్తుకొచ్చింది. తను ఉన్నవాడున్నట్లుగా బయల్దేరాడు. ప్రయాణం లో మురికి అయే...ఈ బట్టలు మార్చుకుని...కాస్త ముఖం కడుక్కుని మరీ శ్యామలను చూస్తే

బాగుంటుంది. అంటే తను విధిగా ముందు మురళి రూమ్‌కే వెళ్లాలి.

బియ్యే ప్యాసై స్టేటుబ్యాంకులో హెడ్‌క్లర్క్‌గా పనిచేస్తున్న మురళికింకా వివాహం కాలేదు. మహారాణిపేటలో ఒక గది తీసుకుని అద్దెకుంటున్నాడు. యస్సెల్సీ వరకూ క్లాసుమేట్సుగా ఉన్న మురళి, వరహాలరావు పియ్యూసీ లో కాలేజీమేట్సుగా మారిపోయారు. మురళిది ఆర్ట్సు గ్రూపు, వరహాలరావుది సైన్సు గ్రూపు. అయినప్పటికీ ఇద్దరూ ఇతర సమయాల్లో బాగా కలిసి తిరిగేవారు. వాళ్ళించుమించుగా ప్రాణ స్నేహితులని చెప్పవచ్చును. బియ్యే అవగానే మురళి తండ్రి ప్రయత్నించి కొడుక్కి స్టేటు బ్యాంకులో గుమాస్తా ఉద్యోగం సంపాదించాడు. పై చదువు చదవడానికి డబ్బు చాలదనీ, చదివినా చెప్పుకోదగ్గ ఉపయోగం లేదనీ సమాధానపడి మురళి బియ్యే అయిన వెంటనే ఉద్యోగస్తుడయ్యాడు. వాళ్ళిద్దరి స్నేహ ప్రభావమెలాంటిదోగానీ వరహాలరావు వాల్తేర్లో యమ్మెస్సీలో చేరిన ఆరునెల్లకే మురళికి కూడా వాల్తేర్లో స్టేటు బ్యాంకులో క్లర్కుగా పోస్టింగు వచ్చింది. మళ్ళీ ఇద్దరూ రూమ్‌మేట్సు అయ్యారు. యమ్మెస్సీ రెండు సంవత్సరాల్లోనూ వారి స్నేహం మరింత అభివృద్ధి చెంది ఇద్దరూ అసలు సిసలు సినిమా ప్రాణస్నేహితులయ్యారు.

వరహాలరావు వచ్చిన సమయానికి మురళి గదిలోనే ఉన్నాడు. అప్పుడే ఎక్కడికో బయలుదేరడానికన్నట్లు డ్రెస్ అవుతున్నాడు. స్నేహితుణ్ణి చూస్తూనే వేసుకోబోతున్న చొక్కాని స్టాండుమీద పడేసి...''రారా కూర్చో... అంతా బాగున్నారా!'' అన్నాడు వరహాలరావు. తలాడించి కూర్చున్నాడు. మురళి ఇక బయటకు వెళ్లే ప్రయత్నం మానేసినట్లున్నాడు. తనూ కూర్చుని ..''ఏమిట్రా విశేషాలూ'' అన్నాడు.

ఒక్క నిముషం పాటు వరహాలరావు ఏమీ మాట్లాడలేదు. జరిగినది స్నేహితుడితో పూర్తిగా చెప్పాలా అన్నది ఒకటీ, ఎలా చెప్పాలా అన్నది ఒకటీ అతన్ని కొన్ని క్షణాలపాటు మౌనంలో ఉంచేశాయి. చివరకు నెమ్మదిగా అన్నీ ఒక్కటొక్కటిగా చెప్పేశాడు! అన్నీ విన్న మురళి నిట్టూర్చి ''మొత్తానికి నువ్వు చేసిన దాంట్లో ఒక్కటీ నాకు నచ్చలేదురా'' అన్నాడు. వరహాలరావుకు చురుక్కుమన్నట్లయింది. మురళే అన్నాడు - ''చూడొరేయ్..మీ నాన్నగారు నీకు పెళ్ళి చేద్దామనుకోడంలోతప్పులేదు. ఆడపిల్లలు కలవారు కాబట్టి కట్నం తీసుకుందామనుకోడంలోనూ తప్పు లేదు. పోనీ పిల్ల అందంగా లేదా అంటే బంగారపు బొమ్మలా ఉందని నువ్వే అంటున్నావు. అటువంటప్పుడు ఆ అమ్మాయిని కాదని శ్యామల కోసం ఇంత దూరం రావడం నాకు నచ్చలేదు. అది మొదటది. రెండోది...నువ్వు శ్యామలను ప్రేమించే మాటయితే మీ నాన్నగారికా విషయం చెప్పేయాల్సింది. అప్పుడాయన ఆ విషయం గురించి ఆలోచించడానికి కొంచెమైనా అవకాశముండేది. నువ్వు మాలతి నెందుక్కాదన్నావో తెలియని మీ నాన్న గారు నువ్వు ఇల్లు వదలి వెళ్లిపోయినందుకు ఎంత కంగారు పడతారో ఆలోచించేవా? కాబట్టి ముందుగా ఓ ఉత్తరం వ్రాసేయ్... శ్యామల గురించి తెలియ బరుస్తూ. ''

వరహాలరావుకి మురళి చెప్పిందాంట్లో సబబు కనిపించింది - ''ముందుగా ఓ సారి శ్యామలను కలుస్తానుగానీ...ఈలోగా నాకిక్కడేదైనా ఉద్యోగం దొరుకుతుందంటావా?'

అనడిగాడు.

"నీ బాధ నా కర్థమయిందిరా నాయనా...నాక్కాబోయే మామగారీ ఊళ్ళో హైలీ ఇన్ఫ్లుయెన్షియల్ మాన్. ఏవియన్ కాలేజిలో ఓ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉందిట.దాన్ని గురించి ఆయనకు నిన్ను రికమెండు చేద్దామనే ఉద్దేశ్యంతోనే నేనా ఉత్తరం నీకు రాశాను. అనుకున్నట్లుగానే నువ్వొ వచ్చావు. ఆ ప్రయత్నాలు రేపు చూద్దాంగానీ ముందు కాస్త బట్టలు మార్చుకో అలా బయటకు పోయి ఫలహారం కానిద్దాం" అన్నాడు మురళి.

స్నానం చేసి మురళి బట్టలు కట్టుకుని నీటుగా తయారయ్యాడు వరహాలరావు.

ఫలహారం చేయగానే "ఓ సారి శ్యామలను కలిసి వస్తా్రా.." అన్నాడు.

"అది నీ ఇష్టం" అన్నాడు మురళి.

ఫలహారాలయేక వరహాలరావు శ్యామల ఇంటికి వెళ్లేడు. శ్యామల ఇల్లంటే పెద్ద భవనానికే వెళ్లాలి. ఎటొచ్చీ ఆ పెద్ద భవనం మాత్రం శ్యామలది కాదు. ఆ భవనంలో వంట మనిషికని ప్రత్యేకించబడిన ఒక గదిలో శ్యామల ఆమె తల్లి ఉంటున్నారు. వరహాలరావు వెళ్లేసరికి శ్యామల బట్టలుతుక్కుంటోంది. అతను వచ్చినట్లు తెలియగానే తొందరగా ఆమె చేతులు కడుక్కుని వచ్చింది. అతనొకసారి ఆమె వంక చూశాడు. జిడ్డుకారుతున్న ముఖం. సన్లైట్ వాసన,మరకల బట్టలు. ఒక్కసారి అతని కళ్ళ ముందు మాలతి ఫోటో తళుక్కున మెరిసి మాయమయింది."బాగున్నావా?" అడిగాడతను.

"ఉత్తరాలందడం లేదా?" ఆమె సమాధానం.

"ఉత్తరాలు చెప్పడానికీ, మనిషి చెప్పడానికీ తేడా ఉండదూ?"

"అయితే చూస్తున్నారుగా..ఎలా అన్పిస్తున్నాను?'

"అంత బాగోలేవు..."

"ఆరోగ్యంగా లేకా...అందంగా లేకా?"

చురుక్కుమని తగిలిందతనికా ప్రశ్న. జవాబివ్వకుండా ఆమె వంకే పరీక్షగా చూస్తూ కూర్చున్నాడు. మాటి మాటికీ మాలతి ఫోటో అతని ముందు మెదలసాగింది.

"ఇప్పుడే వస్తాను..." అంటూ ఆమె లోపలకు వెళ్ళింది. ఆమె లోపలకు వెళ్ళగానే ఆమె తల్లి కాఫీ తీసుకుని వచ్చి.."అమ్మా,నాన్నా అంతా బాగున్నారా బాబూ" అనడిగింది.

"ఆ.."

ఆమె ఇంకేమీ మాట్లాడలేదు.

"మీ ఒంట్లో కులాసాగా ఉంటోందాండీ..." అనడిగాడతను మర్యాద కోసం.

"ఏం ఆరోగ్యమో బాబూ." అంటూ ఆవిడ పురాణం విప్పింది. అతనికి వినడానికి ఆసక్తి లేదని ఆమెకు తెలియదు. ఆమెకే కాదు. యాభైయ్యోపడిలో పడ్డ ఏ వ్యక్తి నడిగినా సమాధానం ఇలాగే ఉంటుంది. ఆవిడకు తరచుగా ఆయాసం వస్తోందిట. గుండెల్లో పోటుట, అప్పుడప్పుడు నరాలు లాగేస్తూంటాయిట. పిల్లదాని భవిష్యత్తు గురించి ఏదో కష్టపడుతున్నాననీ...మరొక్క సంవత్సరం గడిస్తే అదే తన్ను చూసుకుంటుందనే ధైర్యంతో

ఉన్నాననీ చెప్పింది.

వరహాలరావు ఆమె చెప్పేవన్నీ అన్యమనస్కంగా వింటూ ఆలోచించసాగాడు. పది వేల కట్నంతో మాలతి, రోగిష్టి తల్లితో శ్యామల...వీరిలో ఎవరిని తను ఎన్నుకోవాలి?

శ్యామల నీటుగా తయారయి వచ్చింది. ఖరీదైన బట్టలు వేసుకోక పోయినా ఆమె ఇందాకటిమీద శుభ్రంగా ఉంది. వరహాలరావు ముఖం వికసించింది.'అమ్మయ్య! నా శ్యామల అందగత్తే... అనుకున్నాడు.

"కాస్సేపు అలా గాలిలోకి వెడదామా?" అందామె.

అతను అందుకోసమే ఎదురు చూస్తున్నాడు..."పద పోదాం!"

ఇద్దరూ బీచికి వెళ్లారు.

"ఇలా బీచికి వచ్చి చాలా కాలమయింది కదూ?" అన్నాడు వరహాలరావు.

"అవును".. అంది శ్యామల.

"ఈ వేళ బీచికి కొత్త అందం వచ్చినట్లుంది..."

"బీచి ఎప్పుడూ ఒక్కలాగే ఉంటుంది. తేడా చూసే కళ్ళలో ఉంటుంది. అందమైన వస్తువు రోజూ కళ్లబడుతున్నప్పుడు దాని అందాన్ని మనమంతగా గుర్తించలేం. అదే వస్తువును చాలాకాలం తర్వాత చూస్తే, దానికి కొత్త అందాలొచ్చినట్లు కనిపిస్తుంది."

"అందుకే కాబోలు...నాకు నువ్వీవేళ చాలా అందంగా కనిపిస్తున్నావు?"

"అయామ్ వెరీసారీ..నేను అందమైన వస్తువును కాను..."

వరహాలరావో మాటు నాలిక్కరుచుకుని .."నువ్వు అందమైన వస్తువెందుకవుతావు? అందమైన స్త్రీవి!" అన్నాడు.

'మీ పొగడ్తకు చాలా కృతజ్ఞురాలిని. ఇంతకూ మీ హఠాద్దర్శనానికి కారణ మేమిటో?' అంది శ్యామల. ఈ ప్రశ్న వినిపించగానే వరహాలరావు ముఖంలో చిరునవ్వు మాయమైంది. ఏం చెప్పాలా, ఎలా చెప్పాలా అని ఆలోచిస్తూ ఒక్క క్షణం మౌనం వహించాడు. తర్వాత నెమ్మదిగా.. "మా నాన్నగారు నాకు పెళ్లి నిశ్చయించారు. అమ్మాయి అందంగా ఉంటుంది. పదివేలు కట్నం...బి. ఎ. మొదటి ఏడు చదువుతోంది.. పేరు మాలతి!" అన్నాడు.

శ్యామల ముఖంలో రంగులు మారడం వరహాలరావు గమించక పోలేదు. ఆమె ఏం చెబుతుందోనని ఎదురు చూస్తున్నాడు.

"చాలా సంతోషం.. మరి నన్ను పిలుస్తారా మీ పెళ్లికి!" అందామె తాపీగా.

"అలాగంటావేమిటి శ్యామలా! నాకా పెళ్లి ఇష్టం లేదన్నానని మా నాన్నగారికి కోపమొచ్చి ఇల్లొదిలి పొమ్మంటే వెంటనే ఇక్కడి కొచ్చాను. ఆలస్యమైతే ప్రమాదమని.. నిన్ను కలుసుకుని మన పెళ్లి విషయం తేల్చుకోవాలనే వచ్చాను..." అన్నాడతను కంగారుగా.

శ్యామల నవ్వి..."చాలా పొరబాటుపని చేశారు మీరు.." అంది ముక్తసరిగా.

అతనికి ఒళ్లు మండింది.'ఏమిటీ...నీ కోసమని ఇంత దూరం రావడం పొరబాటా?'

అని ...అవున్లే.. నిజమేనేమో..'' అని ఊరుకున్నాడు.

శ్యామల వరహాలరావు కళ్ళలోకి చూసి నవ్వి అంది.''చూడండి.. మీరు వయస్సులో నాకంటే పెద్దవారు. చదువులోకూడా అంతే. కానీ జీవితమంటే మీకింకా తెలియదని నే చెప్పగలను. ఎందుకంటే అనుభవంలో మీరు నా కంటే బాగా చిన్న. జీవించడానికి మనిషికి డబ్బు ఎంత అవసరమో మీ కర్థం కాదు. డబ్బు కోసం మా అమ్మా, నేను పడ్డ అవస్థలు అను క్షణం నా కళ్ల ముందు కదలాడుతూనే ఉంటాయి. అన్ని అవస్థలూ సహిస్తూ మా అమ్మ నన్ను చదివించాలని పట్టుపట్టింది. డబ్బు కోసమే ఆవిడ సీతయ్యగారింట్లో వంట చేస్తోంది. అయినప్పటికీ మా అమ్మ ఇక్కడ వంట మనిషి కంటే ఎక్కువే. సీతయ్యగారు కూడా నా చదువు కోసమని చాలా సహాయం చేశారు. ఆయన్ను ఎంతో ధర్మాత్ముడిగా నేనింతకాలం భావిస్తూ వచ్చాను కూడా. కానీ ఆయన సహాయం వెనుక దురాలోచన ఉందనీ, ఆ సహాయం దూరాలోచనతో కూడినదనీ నాకు నెల్లాళ్ల క్రితం వరకూ తెలియలేదు. నెల్లాళ్ల క్రితం ఆయన ఓ రోజు నన్ను పలకరించారు. ఆ పలకరింపులో ఆయన అసలు సంగతి బయట పెట్టారు. నా చదువు గురించి ఆయన ఇంతవరకూ పన్నెండు వేలు ఖర్చు పెట్టారుట. బాకీ ఉన్నట్లు మా అమ్మ చేత నోటు వ్రాయించుకున్నారు. ''మీకేమీ లేదుగదా...ఎలా తీరుస్తారు?'' అని కూడా అడిగారు. ఎలా తీరుస్తామనుకుని ఇచ్చారని అడిగాను. ''కోపగించుకోనంటే చెబుతాను..'' అని నన్ను వివాహం చేసు కోవాలనుందన్నారాయన. ఆయన వయస్సు నలభై ఏళ్ళు! నేనులిక్కిపడ్డాను. అంతులేని ఆవేశం కలిగింది. ఆయన కాసేపు నాకేసి పరీక్షగా చూసి, ''నాకు పిల్లనిస్తానని... బోలెడుమంది ముందుకొస్తున్నారు. అయినా నీమీద ఒకరకమైన అభిమానం కలగడం వల్ల నిన్నే వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. నాకు బోలెడు డబ్బుంది. నువ్వు సుఖపడతావు. మీ అమ్మకు మంచి వైద్యం చేయించవచ్చు. అన్ని ఏర్పాట్లూ నేను చేసుకుంటాను. అదీకాక నిన్నూ నన్నూ కలిపి కొంతమంది పుకార్లు కూడా చెప్పుకుంటున్నారు. బోలెడు కట్నం ఇచ్చి నీ పెళ్ళి మీ అమ్మ చేయలేదు..ఈ పుకార్ల వల్ల నీ పెళ్లి మరింత కష్టమవుతుంది. ఈ పరిస్థితుల్లో నేను నిన్ను పెళ్ళిచేసుకోవడం ఉత్తమంగా కనిపించింది. లేదంటావూ? నా పన్నెండు వేల బాకీ ఎలాగో తీర్చేసి వెళ్లిపొండి... మీ ఇష్టం!'' అన్నాడు. నాకు కోపం వచ్చింది. పేదవాడి కోపం పెదవికి చేటు అని ఊరుకున్నాను. ఉక్రోషం వస్తే దిగమింగుకున్నాను. ఆలోచించుకుని చెబుతానని ఆయనకు చెప్పి వచ్చేశాను. ఈ విషయాలేవీ మా అమ్మకు తెలియవు.'' శ్యామల ఒక్క నిముషం ఆగి వరహాలరావు వంక చూసింది. 'పోనీ నాకుత్తరం రాయక పోయావా' అని వరహాలరావు అడుగుతాడేమోనని ఆమె ఆశ. కానీ అతనలాంటి ప్రశ్నలు వేసే ఉద్దేశ్యంలో ఉన్నట్లు లేదు సరిగదా... తీవ్రాలోచనలో ఉన్నట్లున్నాడు.

అతన్ని మాట్లాడించడం కోసం శ్యామల మరో వైపు నించి మొదలెట్టింది. ''మిమ్మల్ని వివాహం చేసుకోడానికి నా అభ్యంతరం ఎప్పుడూ లేదు. కానీ భవిష్యత్తు గురించి మీరు కంటున్న బంగారు కలలు నా మూలంగా నాశనం కావడం నా కిష్టం లేదు. అప్పటికీ సీతయ్య గారు బాగానే చెప్పాడు. ఎవరైనా డబ్బున్నవాళ్లు పన్నెండు వేలూ ఇంతకాలంలో

తీరుస్తామని హామీ ఇచ్చినట్లయితే చాలన్నాడు. కానీ మిమ్మల్ని ఆ హామీ అడగడం నా కిష్టం లేదు. ఇంత వరకూ మీరు కష్టాలనేవి ఎరుగరు. కట్నంతో వచ్చే కన్నెపిల్లను కాదని...పన్నెండు వేల అప్పుతో, రోగిష్టి తల్లితో అంతులేని బాధ్యతల పాల్జేసే అమ్మాయిని మీరు కోరుకోవడం నా కిష్టం లేదు. అందుకే అసలు విషయాన్ని మీకు చెప్పాను. ఆలోచించండి..."

వరహాలరావు దీనంగా శ్యామల వంక చూశాడు. "అగు శ్యామలా! నన్నూరికే బెదరగొట్టేస్తున్నావు. ఏ పరిస్థితుల్లోనైనా నిన్ను వివాహం చేసుకోవాలనుకున్నాను. చేసుకుంటాను కూడా..నువ్వూ నేనూ ఉద్యోగం చేస్తే రెండు మూడేళ్లలో పన్నెండు వేల బాకీ తీర్చడం పెద్ద సమస్య కాదు..."

శ్యామల కళ్ళు మెరిశాయి. "నిజంగా మీ హృదయం చాలా మంచిది. నేను చాలా అదృష్టవంతురాలిని. కానీ ఒకవేళ రెండు మూడేళ్ళ వరకూ మీకుద్యోగం దొరకలేదనుకోండి..ఏం చేస్తారు? ఎక్కడుంటారు? అదీకాక నా ఎమ్మే పూర్తికావడానికి మరో సంవత్సరం కావాలి గదా..."

వరహాలరావు ఆలోచించాడు. "ఏమిటో అంతా అయోమయంగా ఉంది శ్యామలా! ఉద్యోగం దొరుకుతుందనే నమ్మకముందనుకో.. కానీ దొరక్కపోతే..."

"ఏవిషయమూ మీరు బాగా ఆలోచించుకోవాలి.. జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోగలిగే శక్తి మీలో ఉండాలి. డబ్బుంటే అన్ని శక్తులూ అదే ప్రసాదిస్తుంది. అది లేకుండా సమస్యల నెదుర్కోనే ధైర్యం మీకుందో లేదో ఆలోచించండి..."

శ్యామల మాటల వెనుక ఏదో గూడార్థమున్నదని అతనికి అనుమానం కలిగింది. ఆమె ఏదో చెప్పబోతోందనీ... అందుకిది ఉపోద్ఘాతమనీ అతను గ్రహించాడు."అంటే?" అన్నాడతను.

"మీరు నన్నపార్థం చేసుకోవద్దు రావు గారూ! నేనింతవరకూ కష్టాలే అనుభవించాను. ఇంక నాలో కష్టాల్ని భరించే శక్తి నశిస్తోంది. సుఖంగా జీవించాలన్న కోరిక తలెత్తుతోంది. అటువంటి సమయంలోనే మీ పరిచయం నాకు లభించింది. మీ సన్నిధిలో సర్వం మరిచిపోయేదాన్ని. శాశ్వతంగా మీదాన్నయి...జీవితమంతా హాయిగా గడిపేయాలన్న కోరికనాలో అప్పుడే ఉదయించింది. అయితే ఇప్పుడు సీతయ్యగారి సమస్య అనుకోకుండా తగిలింది. మన వైవాహిక జీవితం సుఖమయం కావాలంటే మీరు రెండు పనులు సాధించగలిగి ఉండాలి. ఒకటి.. పన్నెండు వేలు తక్షణం ఇవ్వగలగడం, లేదా ఒక పథకం ప్రకారం ఇచ్చే పద్ధతి ఆలోచించడం. రెండు.. జీవిత సమస్యల్ని ఎదుర్కోగల మనస్తత్వం కలిగి ఉండడం. జీవితమంటే వడ్డించిన విస్తరి కాదు. అనుకోని భయంకరమైన సమస్యలు ఎదురవుతాయి. అటువంటి సమయంలో మీరు దిగజారి పోకూడదు. ఏ పరిస్థితుల్లోనూ నన్నొక పీడగా మీరు భావించకూడదు. ఇవన్నీ నేను మీకెందుకు చెబుతున్నానంటే...నేను కూడా మిమ్మల్ని ప్రేమిస్తున్నాను కనుక...లేకపోతే శేషగిరిని రెండు నెలల క్రితమే అంగీకరించి ఉండేదాన్ని..."

ఆమె చెప్పేదంతా శ్రద్ధగా వింటూన్న వరహాలరావు ఉలిక్కిపడ్డాడు. అతనికి శేషగిరి

తెలుసును. శేషగిరి లక్షాధికారి బిడ్డ. వెనకాముందూ ఎవ్వరూ లేరు. జల్సారాయుడే కానీ చెడు అలవాట్లు లేవు. అతను శ్యామల క్లాసుమేటు.

శ్యామల మళ్ళా చెప్పసాగింది. - "నేను నిజంగా శేషగిరిని ప్రేమించలేదు. కానీ అతను నన్ను ప్రేమిస్తున్నాడు. ఈ సెలవుల్లో కాస్త పరిచయం కూడా ఎక్కువైంది. ఆఖరికి వారం రోజుల క్రితం అతను అసలు విషయం బైటపెట్టాడు...నన్ను పెళ్లి చేసుకుంటానని. అతని పరిచయం ఈ ధోరణికి దిగుతుందని ముందే తెలిసినప్పటికీ ఏమీ అనలేకపోయాను. అప్పుడే మాటల సందర్భంలో నేను నా ఇబ్బందులు కొన్ని చెప్పాను. అతను అన్నీ విని చాలా నిర్లక్ష్యంగా జేబులోంచి చెక్కు బుక్కు తీసి..'ఇప్పుడు ఎంత కావాలో అంకె వేసుకో'... అన్నాడు. నేను మ్రాన్పడిపోయాను. ఇప్పట్లో పెళ్లి ప్రసక్తి వద్దనీ నన్ను బాగా ఆలోచించు కోనిమ్మనీ అడిగాను."

వరహాలరావు ముఖం ఎర్రగా తయారయింది. "అయితే నేను కాదంటే శేషగిరిని వివాహం చేసుకుంటావన్నమాట.." అన్నాడు.

"మగవాడే వెనుక దీసినప్పుడు ఆడది ఏం చేయగలదు చెప్పండి?"

"నా బాధ అదికాదు శ్యామలా! నన్ను బాగా అర్థం చేసుకున్న నువ్వు...నేను కాదంటే ఎందుకైనా మంచిదని మరో ప్రేమికుణ్ణి రిజర్వు లో ఉంచుకోవడం నా కెలాగుంటుందో ఆలోచించు..."

శ్యామల అదోలా నవ్వింది. "అందుకే ముందుగా చెప్పాను. నన్నపార్థం చేసుకోవద్దని. నేను చెప్పేదేమిటంటే నాకో రిజర్వు ప్రేమికుడు కూడా తయారయ్యాడు. అయినా నేను మీ గురించి అతన్ని వదులు కుంటున్నానని..."

"నా మీద పూర్తిగా నమ్మకమున్నప్పుడు వెంటనే కాదని అతనితో ఎందుకు చెప్పలేదు? నేను వద్దంటే అదీ చేయి దాటి పోతుందనేగా? శ్యామలా! నీ ప్రేమ వెనుక ఇంత స్వార్థం దాగి ఉంటుందని నేను కలలో కూడా అనుకోలేదు. నన్ను నువ్వు త్రికరణశుద్ధిగా ప్రేమిస్తున్నావనే నమ్మాను. అందుకే నీ కోసం అన్నీ వదులుకుని ఇక్కడకు వచ్చాను. అది సరే కానీ శ్యామలా..ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పు. నేను నీ బాధ్యతలను స్వీకరించలేనంటే నువ్వు ఆనందంగా శేషగిరిని అంగీకరిస్తావు కదూ? కొద్దిగా బాధపడినా ఆ బాధతోనే కృంగిపోవు కదూ?"

ఒక్క నిముషం పాటు శ్యామల వంచిన తల ఎత్తలేదు. తర్వాత ఆమె తలెత్తి అతని వంక చూసింది. ఆమె కళ్ళు కొద్దిగా చెమర్చినట్లు వరహాలరావు గుర్తించాడు. ఆమె పెదవులు కదిలాయి..."చూడండిరావు గారూ..మీరొకవిధంగా నిజాన్ని ఊహించారు. మీరు కలిగిన కుటుంబంలో పుట్టారు. సమస్యల గురించి మీకాట్టే తెలియదు. బోలెడు సినిమాలు చూసుంటారు. కథలు చదివుంటారు. అన్నింటిలోనూ మీకు కనిపించినది ప్రేమ అయియుంటుంది. ప్రేమ కోసం ప్రపంచంలో దేన్నీ లెక్కచేయని పాత్రలు మిమ్మల్నాకర్షించి ఉంటాయి. ఆ పాత్రల్లా ప్రవర్తించగలగడం మనుష్యులకు మరీ అంత సులభం కాదు. కావాలనుకున్న అమ్మాయి దొరకనంత మాత్రాన ఆ అబ్బాయి పిచ్చివాడయిపోడు. కొన్నాళ్ళు

బాధపడి క్రమంగా మరిచిపోతాడు. అలాగే నా ప్రేమ - వెనకా ముందూ ఆలోచించలేని పుస్తకాల ప్రేమ కాదు. ఒకేసారి కళ్ళు కలవడంతో మిమ్మల్ని నేను ప్రేమించలేదు. మీరు మంచివారనీ, మిమ్మల్ని నా భాగస్వామిగా తీసుకోవడం ద్వారా సుఖపడతాననీ అనిపించాకే ప్రేమించడం మొదలెట్టాను. వివాహం చేసుకున్నాక ఇద్దరికీ సుఖపడే అవకాశం లేదనిపిస్తే మనం వివాహం చేసుకోవడం అనవసరం. మీరే బాగా ఆలోచించి నేను మిమ్మల్ని చేసుకుంటే బాగుంటుందో, శేషగిరిని చేసుకుంటే బాగుంటుందో చెప్పండి. ఒక్క విషయం మాత్రం నిజం! నేనుమిమ్మల్ని ప్రేమించినట్లు శేషగిరిని ప్రేమించలేదు. అలాగని శేషగిరిని చేసుకున్నంత మాత్రాన జీవితమంతా బాధపడిపోను....''

వరహాలరావుకు శ్యామల ఉపన్యాసం విన్నాక జీవితం అర్థం కాలేదు. కానీ శ్యామల అంటే మాత్రం అసహ్యం వేసింది. తను ఎంతో ఉన్నతురాలిగా ఊహించుకున్న శ్యామల చాలా అల్పురాలనీ, స్వార్థపరురాలనీ అతనికి అర్థమయిపోయింది. ఇంత కాలం తన ప్రేమ ఆమె మీద వ్యర్థమయిపోయిందే అని అతను బాధపడ్డాడు కూడా. ఆ బాధనే అతను తన స్నేహితుడు మురళి ముందు వ్యక్తపరిచాడు.. - ఆ రాత్రి మళ్లీ ఇద్దరూ కలిసినప్పుడు.

అతను చెప్పిందంతా శ్రద్ధగా విన్న మురళి భారంగా నిట్టూర్చాడు. 'శ్యామల చెప్పిందాంట్లో గొప్ప జీవిత సత్యం ఉందన్న విషయం నువ్వు గుర్తించినట్టు లేదు. ఆమెకు నీ మీద ప్రేమ ఉంది. నీ అసహాయతపైన జాలి ఉంది. నీ సమర్థతపైన ఒక విధమైన అపనమ్మకం కూడా ఉంది. ఆమె చెప్పినట్లు ఈ పరిస్థితుల్లో మీ ఇద్దరి వివాహం అంత ఆనందదాయకం కాదు..'

మురళిని సగంలో ఆపి అన్నాడు వరహాల రావు.. ''శేషగిరిని పెళ్లాడినా ఆ బాధ ఎన్నాళ్లో ఉండదు...క్రమంగా నన్ను మరిచిపోగలదుట''

''ఆ విషయంలో ఎవరైనా అంతే! ఎటొచ్చీ, ఆమె ధైర్యంగా ఆ నిజాన్ని నీ ముందే ఒప్పుకుంది. కనిపెంచిన తల్లిదండ్రులు చనిపోతే ఎంతకాలం గుర్తుంచుకుంటున్నాం చెప్పు మనం? అయినా నువ్వు మాత్రం ఆమెనెంతకాలం గుర్తుంచుకోగలవు? అసలు.. అప్పుడే నీ ప్రేమ ఆమె మీద వ్యర్థం చేశానే అని బాధపడ్డం మొదలెట్టావు కూడా...''

స్నేహితుడిలా మాట్లాడ్డం వరహాలరావుకు నచ్చలేదు. అందుకే నెమ్మదిగా...''ఏమిటీ వేళ...శ్యామలని సపోర్ట్ చేస్తున్నావు?'' అనడిగాడు.

మురళి తలెత్తి వరహాలరావు కళ్లలోకి సూటిగా చూశాడు. వరహాలరావు ఆశ్చర్యపోయాడు. మురళి కళ్ళలో నీళ్లు!

''అదేమిట్రా.. ఏమయింది నీకు?''

''ఒరేయ్ ఈ లోకంలో స్వార్థం స్నేహాన్ని మించినదని తెలియజేయడానికి నేనే ఋజువుకాబోతున్నాన్రా!'' గద్గదికంగా ఉన్న మురళి కంఠంలో ఒక్క నిముషం మాట పెగల్లేదు. ''ఇందాకా మా బ్యాంకు ఆఫీసరుగారింటికి వెళ్లాను. నా ప్రమోషన్ చాలా వరకూ ఆయన చేతిలోనే ఉందిలే.. దాన్ని గురించి చిన్న హింట్ ఇచ్చి తన బావమరిదొకడున్నాడనీ వాడికి కాలేజీలో లెక్చరర్ పోస్టు గురించి ట్రై చేయాలనీ చెప్పాడు. నా కాబోయే మావగారికున్న ఇన్‌ఫ్లుయన్స్ గురించి ఆయనకు తెలుసు. పని జరక్కపోయిందా... నా ప్రమోషన్ ఆగిపోతుంది. ఇంతకూ ఆయన బావమరిదిది సరిగ్గా నీ క్వాలిఫికేషనే కావడం నా దురదృష్టం! ''

వరహాలరావు తల తిరిగిపోయింది. మురళి నిర్ణయం ఏమిటో అతని కన్నీళ్ళే చెబుతున్నాయి.

"చూడొరేయ్...మీ నాన్న కాస్తో కూస్తో ఉన్నవాడు. నిన్నేదో ఉద్యోగంలో వేయించగల సమర్ధత ఉన్నవాడు. కానీ నీ గురించి ఈ ఒక్క అవకాశం వదులుకున్నానంటే... నాకు జీవితంలో పైకి పోయేఅవకాశం ఉండదు. ఏదేమయినా నేను తీసుకునే నిర్ణయం మూలంగా మనిద్దరి స్నేహానికీ ఏ విధమైన భంగమూ రాకూడదు"

నిజంగా వరహాలరావుకు మురళి మీద చాలా అసహ్యాభావం కలిగింది. సరిగ్గా ఇదే సమయంలో చిన్న మాటతో మురళి అతని మీద ఎదురు దెబ్బ తీశాడు. "నా ప్రాణ స్నేహితుడి కోసం నేనేమైపోయినా సరే అని ఓ నిర్ణయానిక్కూడా వచ్చేశాను ఓ క్షణాన. కానీ అంతలోనే నాకు అనిపించింది. నీ ఉద్యోగం కోసం నా జీవితాన్ని నాశనం చేసుకోవడం స్నేహితుడుగా నువ్వు హర్షించగలవా అని..."

మురళి ఇంకా చెప్పుకుపోతున్నాడు. కానీ వరహాలరావు కి ఏమీ వినిపించడంలేదు. అతను తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. మురళి ఈ త్యాగం చేయలేదని బాధపడుతున్నాడంటే తను నిజంగా ఏం స్నేహితుడు? తన్ను వివాహం చేసుకోకపోయినా శ్యామల సుఖంగా ఉండగలదని ఓర్వలేని తను ఏం ప్రేమికుడు?

ఈ విషయం గ్రహించాక అతనికి తనలోని లోపం అర్ధమయింది. అది అర్ధమయ్యేక తను విశాఖపట్నం ఎందుకొచ్చిందీ అతనికి అర్ధం కాలేదు. ఆ తర్వాత ఏం చేయాలో కూడా అతనికి అర్ధం కాలేదు.

మర్నాడతను శ్యామలను కలుసుకుని..బాధ్యతలను స్వీకరించడం తన వల్లకాదని చెప్పేశాడు. చెప్పేసి తిరిగి ఇంటికొచ్చేసరికి మురళి చెప్పాడు.. టెలిగ్రాం వచ్చిందని. వచ్చింది కృష్ణారావుగారి దగ్గర్నుంచి. వరహాలరావు విశాఖపట్నంలో ఉన్నట్లయితే వెంటనే పంపించమని దాని సారాంశం. అది ఆధారంగా తీసుకుని... స్నేహితుడి దగ్గర ఓ పది రూపాయలు అప్పే తీసుకుని వరహాలరావు తిరుగు ప్రయాణం కట్టాడు.

ఆకాశంలో వెలిగే చందమామ మనకు దూరంగా ఉన్నప్పుడు దాని గురించి మనం ఎన్నో కలలు కన్నాం... కథల నూహించాం... కవిత లల్లాం! విజ్ఞానం అభివృద్ధిచెంది... మానవుడిని చందమామ మీద దించింది. ఇప్పుడది రాళ్ళూ, రప్పలూ, గుంటలతో కూడిన నీళ్లు దొరకని ఎడారి ప్రాంతం. నిజమెప్పుడూ కల్పనలా కాక అందవికారంగా ఉంటుంది. కానీ నిజం నిజమే!

అపోలో నౌకకు చంద్రుని అందంతో నిమిత్తం లేదు. చంద్రుని అర్ధం చేసుకోవడమే దాని పని. జీవితం ఒక చంద్రుడైతే ప్రతి మనిషీ ఒక అపోలో. నిజాన్ని నిజంగా అర్ధం చేసుకోగల ప్రతి మనిషీ జీవితాన్ని క్రమంగా అర్ధం చేసుకోగలుగుతాడు.

వరహాలరావు అనబడే అపోలో ఇప్పుడు తిరుగు ప్రయాణంలో ఉంది. ఆవేశం కల్పించిన ఊహాలోకంనించి వాస్తవానికి తిరుగు ప్రయాణం అది! జీవితమనే చంద్రుడి వద్ద నుంచి అనుభవాలనే మట్టిని సేకరించిన వరహాలరావు అనబడే అపోలో.. ఆ మట్టిని గురించి ఇప్పుడనేక పరిశోధనలు జరపాల్సి ఉంది. ★

(ఆంధ్ర పత్రిక సచిత్ర వార పత్రిక - 6.8.'71).